క్లుప్తంగా

గ్రామాల్లో ఫాగింగ్ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: దోమల నివారణకు వీలుగా ఫాగింగ్ చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన కార్యాలయంలో సోమవారం కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమలు ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ఫాగింగ్ చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను విధిగా శుభ్రం చేయాలన్నారు. పైపుల లీకేజీలను అరికట్టాలని సూచించారు. దోమలు లేకుండా ఉండాలంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈవోఆర్‌డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పరిశీలిస్తున్న ఏపీడీ సీతయ్య

గూడెంకొత్తవీధి: ఉపాధి హామీలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చింతపల్లి ఉపాధి హామీ ఏపీడీ లాలం సీతయ్య ఆదేశించారు. ఆయన సోమవారం గూడెంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారంపాండ్‌లను, చెరువుల పనులను పూర్తి చేయాలని సూచించారు. దీని అనంతరం ఆయన డ్రాగన్ ఫ్రూడ్ మొక్కలను పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఏపీవో రాం ప్రసాద్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



చింతూరులో దీక్షలో కూర్చున్న వారికి మద్దతు తెలియజేస్తున్న సర్పంచ్ చంద్రయ్య

చింతూరు: ఆదివాసీ చట్టాలు, హక్కుల సాధనకు యువత ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 19 రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని సోమవారం పేగ సర్పంచ్ పాయం చంద్రయ్య సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆదివాసీ ఉద్యోగ నియామక చట్టాన్ని ప్రకటించాలని, షెడ్యూల్ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సత్యనారాయణ, తమ్మయ్య, రాము, వెంకయ్య, బొజ్జి, గంగయ్య, పాదయ్య పాల్గొన్నారు.

సమస్యలపై పీవోకు వినతి

గంగవరం: హైవే నిర్మాణంలో భాగంగా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ మడకం బాబూరావు దొర, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కోసు బుల్లియమ్మ తదితరులు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలంను సోమవారం కలసి పలు సమస్యలను విన్నవించారు. ఇటీవల జాతీయ రహదారి నిర్మాణంలో మండల కేంద్రంలో ఇళ్లను తొలగించారని తిరిగి మళ్లీ తొలగింపునకు చర్యలు తీసుకుంటే ప్రజలు ఇంకా నష్టపోతామని గిరిజనులకు తగిన న్యాయం చేయాలని కోరారు. దీనిపై పీవో స్పందించి ఆక్రమణల్లో గిరిజనులు ఉంటే వారి పరిస్థితులను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనుల అభివృద్ధికి అధికారులంతా కృషి చేస్తున్నామన్నారు. గిరిజనులను ఇబ్బందులు పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామని పీవో సింహాచలం హెచ్చరించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నాతవరం: మండల కేంద్రంలో వెలసిన శ్రీకోటమ్మ తల్లి పండగ సందర్భంగా సోమవారం గరగల ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత గరగలను పురవీధులతో ఊరేగించారు. ఈనెల 3న అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రాట ఏర్పాటు చేసి సంబరాలు చేశారు. మూడేళ్లకోసారి ఈ పండగ జరపడం ఆనవాయితీ. గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. మహిళల కోలాటం, భజనలు, శక్తి వేషాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

హైవేపై సోలార్ వెలుగులు

● మెరుగుపడిన రహదారి ● తప్పిన ట్రాఫిక్ పాట్లు



బోసుబెడలో బస్ షెల్టర్ వద్ద ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు

అరకులోయటౌన్: జాతీయ రహదారి నిర్మాణంతో విశాలమైన దారితో మెరుగైన సౌకర్యం అనేక సదుపాయలను కల్పిస్తున్నారు. రాజమండ్రి–విజయనగరం ఎన్‌హెచ్– 516లో డుంబ్రిగుడ మండలం నుంచి అరకులోయ మండలం కొత్త భల్లుగుడ పార్ట్ హైవే రహదారిని నిర్మించారు. ఈ దారిలో సోలార్ లైట్‌లు అందుబాటులో తీసుకొచ్చారు. డుంబ్రిగుడ మండల కేంద్రంతోపాటు అరకు సంతబయలు రహదారుల్లో ఇరువైపులా, ప్రధాన మలుపుల వద్ద లైట్లు ఏర్పాటు చేశారు. డుంబ్రిగుడ మండల కేంద్రం నుంచి అరకులోయ మండలం బోసుబెడ గ్రామం వరకు హైవే పక్కన ఉన్న గ్రామాల్లో తొమ్మిది బస్ షెల్టర్‌లు నిర్మించి, బస్ షెల్టర్‌కు ఇరువైపులా లైట్లు ఏర్పాటు చేశారు. మొత్తం 130 సోలార్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

తీరిన సమస్య

డుంబ్రిగుడ మండల కేంద్రంతో పాటు అరకు సంతబయలులో గతంలో వీధి లైట్ల సమస్య తీవ్రంగా ఉండేది. ఇరుకు రోడ్డులో సంత నిర్వహణ, మండల కేంద్రంలో ఫుట్‌పాత్‌ల వ్యాపారాలు చేస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అంతేకాకుండా శుక్రవారం వారపుసంత రోజు అరకు సంతబయలు వద్ద తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడేది. హైవే రహదారి నిర్మించడంతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు వీధిలైట్ల సమస్య తీరిందని స్థానికులు చెబుతున్నారు. డుంబ్రిగుడ మండల కేంద్రం నుంచి అరకులోయ మండలంలోని బోసుబెడ గ్రామం వరకు హైవే రహదారిలో 9 బస్ షెల్టర్‌లు నిర్మించి, ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. గతంలో బస్ షెల్టర్‌లు లేక రాత్రి వేళల్లో చీకట్లోనే రోడ్డుపైనే బస్ కోసం వేచి ఉండేవారు. ప్రస్తుతం బస్ షెల్టర్‌లకు ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటుతో రాత్రిళ్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా బస్ షెల్టర్‌లలో ప్రయాణికులు వేచి ఉంటున్నారు. బస్ దిగి గమ్యస్థానాలకు వెళ్లాలన్నా నిచ్చింతగా వెళ్తున్నామని ప్రయాణికులు చెబుతున్నారు.



అరకు సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన లైట్లు



డుంబ్రిగుడలో సోలార్ లైట్లు

రహదారి మెరుగుపడింది



గతంలో మండల కేంద్రంలో వీధి లైట్ల సమస్య తీవ్రంగా ఉండేది. చీకటి పడితే చిమ్మ చీకట్లో ప్రజలు రాకపోకలు సాగించేవారు. జాతీయ రహదారి నిర్మాణం చేపట్టి, ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం 7 గంటలైతే సోలార్ లైట్లు వెలిగిస్తున్నారు. దీంతో ప్రజలకు రాత్రి వేళల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– బి. రవి. డుంబ్రిగుడ మండల కేంద్రం.

ఆందోళనగా ఉండేది



బస్ షెల్టర్‌కు ఇరువైపుల సోలార్ లైట్ల ఏర్పాటు ప్రయాణికులకు, స్థానికులకు ఎంతో ఉపయోగం. గతంలో చీకటి పడితే బస్ షెల్టర్‌కు వెళ్లాలంటే భయపడేవారు. జాతీయ రహదారిలోని గ్రామాల్లో బస్ షెల్టర్‌లు నిర్మించి ఇరువైపులా సోలార్ లైట్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగాయి.

– మజ్జి అప్పలస్వామి, గిరిజనుడు, బోసుబెడ గ్రామం, అరకులోయ

ఆత్మీయ సన్మానం



అక్కయ్య దంపతులను సన్మానిస్తున్న సీడీపీవోలు, సిబ్బంది

కొయ్యూరు: మండల కేంద్రంలో ఐసీడీఎస్ శాఖ పరిధిలోని వివిధ సీడీపీవో కార్యాలయాల్లో అటెండర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన దూరి అక్కయ్యను స్థానిక సీడీపీవో విజయకుమారి, చింతపల్లి రమణి తదితరులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్కయ్య అందించిన సేవలు మరువలేనివన్నారు. మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సిబ్బంది తదితరులు దూరి అక్కయ్య దంపతులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్ సదాశివం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఇందుకూరుపేటలో రోడ్డు కొలతలు తీసుకుంటున్న ఉద్యోగులు

రంపచోడవరం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో రహదారికి ఇరువైపులా అక్రమణలు తొలగింపునకు రెవెన్యూశాఖ కొలతలు ప్రారంభించింది. స్థానిక సెంటర్ నుంచి బ్యాంకు సెంటర్ మీదుగా జెడ్పీ పాఠశాల వైపుగా కొలతలు తీసుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఎక్కువ కావడంతో రెవెన్యూశాఖ తొలగింపుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఇళ్లు, షాపుల యాజమానులకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. మండల కేంద్రం దేవీపట్నం పోలవరం ముంపులో మునిగిపోవడంతో ఇందుకూరుపేటలోనే అన్ని మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. పోలవరం ప్రాజెక్టు కూడా సమీపంలోనే ఉండడంతో ఇందుకూరుపేట రోడ్డు ప్రాధాన్యత ఏర్పడిందని పలువురు చెబుతున్నారు.

రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్‌లో ప్రతి మండలంలో రోడ్డుకు ఇరువైపులా గల ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. రాజవొమ్మంగిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారు మంగళవారంలోగా ఖాళీ చేయాలని తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్‌కు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమణలో ఉన్న భవనాలు, స్థలాలకు సోమవారం మార్కింగ్ ఇచ్చారు. ఈ విధంగా ఆక్రమణలో ఉన్న 138 భవనాలను మండలంలో గుర్తించామని, వీరికి 15 రోజుల క్రితం నోటీసులు ఇచ్చామన్నారు. ఆక్రమణలను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు.

రహదారులు నిర్మించాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు ,గ్రామస్తులు

ఎటపాక: గుండాల గ్రామ పంచాయతీలో రహదారులు నిర్మించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఎర్రబోరు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గుండాల సచివాలయం ముందు గత ఐదు రోజులుగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా సోమవారం రాస్తారోకో చేపట్టి తమ డిమాండ్లను వినిపించారు. గత 15 సంవత్సరాలుగా రహదారి మరమ్మత్తులకు నోచుకోక అన్ని రంగాల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరమ్మ, భరణి కుమారి , అజయ్, సత్యం, శ్రీను, సుధాకర్, ప్రవీణ్, స్టాలిన్, లక్ష్మి, ముత్తయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కొండాయిగూడెంలో మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కూనవరం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని హెల్త్ అసిస్టెంట్ సోంది వెంకటేశ్వర్లు అన్నారు. మాలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మండల మరిధిలోని కొండాయి గూడెంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. మురుగునీరు నిల్వలేకుండా చూడాలని, ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. యూత్ లీడర్ రాజు, వైద్య సిబ్బంది శివజ్యోతి, పద్మ, బజారమ్మ, సుబ్బలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



డీటీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు తదితరులు

చింతపల్లి: మండల కేంద్రంలో కోర్టు ఆదేశాల మేరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఉపాధి కోల్పోతున్న లబిదారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల హైకోర్టు ఉత్తర్వుల అనుసారం కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని హనుమాన్ జంక్షన్ నుండి డిగ్రీ కాలేజి వరకూ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని శనివారం నుంచి చేపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది నిరుపేద గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. హంసరాజు ,నరేష్, రమణతో పాటు పలువురు బాధితులు పాల్గొన్నారు.

సాగుపై దృష్టి సారించాలి



హుకుంపేటలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



పెదబయలులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ,అధికారులు

హుకుంపేట: రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న వరి విత్తనాలను గిరిరైతులు సద్వినియోగం చేసుకోవాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.మోహన రావు, ఏవోలు లీలావతి, నీలవేణి, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ప్రభుత్వం సబ్సిడీపై వరి విత్తనాలు అందిస్తున్నట్టు ఎంపీపీ బొండా వరహాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు అన్నారు. సీతగుంట రైతు సేవా కేంద్రంలో సోమవారం వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం 1145 క్వింటాళ్ల వరి విత్తనాలు స్టాకు ఉన్నట్టు చెప్పారు. విత్తన మెలక శాతం బాగుందని, వాతావరణం కూడ అనుకూలంగా ఉందన్నారు. మండలంలోని గంపరాయి, సీకరి, అడుగులపుట్టు, సీతగుంట కేంద్రాల్లో సంబంధిత సిబ్బందికి అందించనున్నట్టు చెప్పారు. తహసీల్దార్ రంగారావు, ఈవోఆర్‌డీ నర్సింగరావు, ఆర్‌ఐ పూర్ణయ్య, సీతగుంట, లక్ష్మీపేట సర్పంచ్‌లు పలాసి మాధవ రావు, అశోక్‌కుమార్, నాయకులు భాస్కర్‌ం



లంబసింగిలో ఎరువులను పంపిణీ చేస్తున్న ఏవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాగమణి

చింతపల్లి: గిరిజన రైతాంగం ప్రభుత్వం అందిస్తున్న పచిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకుని పంటల్లో మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. లంబసింగి పంచాయితీ కేంద్రంలో రాయితీపై గిరిజన రైతులకు పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎరువులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసి సభ్యురాలు రావుల నాగమణి, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, ఉద్యాన సహాయకులు కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా కృషి



ఒంటిపుట్టులో బోరు పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ నోయిన, ఎంపీటీసీ కమల, నేతలు

ముంచంగిపుట్టు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నానని సర్పంచ్ జనం నోయిన, ఎంపీటీసీ సభ్యురాలు బజ్జంగి కమలలు అన్నారు. మండలంలోని పనసపుట్టు పంచాయతీ ఒంటిపుట్టు గ్రామంలో సోమవారం పీఎం జన్‌మన్ ద్వారా తాగునీటి బోరును సర్పంచ్, ఎంపీటీసీలు పర్యవేక్షణలో వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో ప్రతి గ్రామంలో నీటి సమస్యను గుర్తించి, దశలవారీగా నీటి సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందన్నారు. పంచాయతీ, జెడ్పీ, జెజెఎం నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. నాయకులు తిరుపతి, వీరన్నపడాల్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం విజయవంతం చేయండి



ముంచంగిపుట్టులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



జి.మాడుగులలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జీకే వీధిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నేతలు



పెదబయలులో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు



పాడేరులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు రాంబాబు తదితరులు

పెదబయలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలుచేయకుండా, సూపర్‌సిక్స్‌ను అమలును పట్టించుకోకుండా ప్రజలను మోసం మోసం చేస్తున్న తీరును నిరసిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 4న వెన్నుపోటు దినంను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు మాట్లాడుతూ కోవిడ్ వంటి మహమ్మారిని సైతం ధైర్యంగా ఎదుర్కొని అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి,అభివృద్ధి పనులు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎన్నడూ మరచిపోరన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంక్షేమ పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఎన్నికల మానిఫెస్టోలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా అవహేళన చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అమలు కానీ హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెట్టి అధికారంలో వచ్చి ఏడాది కావస్తున్నా ఒక్క పథకం అమలు చేయకపోగా పథకాలు ఒక్కొక్కటిగా తొలగిస్తోందన్నారు. ప్రజలను వెన్నుపోటు పొడిచిందన్నారు. వలంటీర్ల వ్యవస్థను తొలగించారని, ఇంటింటా రేషన్ కార్యక్రమాన్ని రద్దు చేశారని, దీంతో మారుమూల ప్రాంతాల ప్రజలు కొండలు, గుట్టల ఎక్కి రేషన్ కోసం డిపోలకు వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం మరిచారని, తల్లికి వందనం ఇవ్వడం లేదని ఇలా అన్ని పథకాలను అటకెక్కించారన్నారు. రాష్ట్రంలో కుట్ర రాజకీయాలు, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. కూటమీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని గిరిజనులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం కార్యక్రమం పోస్టర్‌ను పలు మండలాల్లో సోమవారం ఆవిష్కరించారు.

పెదబయలులో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, నాయకులు కొండబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షులు పల్టాసింగి ధనరాజ్, పెదకోడాపల్లి ఎంపీటిసి సభ్యులు అప్పారావు, సర్పంచ్ బట్టి చిట్టిబాబు,మాజీ సర్పంచ్ ఎ. ప్రసాద్ నాయుడు,వంతాల కామేశ్వరరావు,పార్టీ నాయకులు కూడ రాజారావు,బాలరాజు,సుబ్బారావు, లక్ష్మీనాయుడు, కేశవరావు, పూర్ణయ్య, కరివేపరాజు, నాగంనాయుడు, మత్స్యకొండబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు, సర్పంచులు నీలకంఠం, గంగాధర్, రమేష్, బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు సుబ్బలక్ష్మి, గణపతి, నోబ్బో, నాయకులు జగబంధు, అప్పారావు, అర్జున్, సురేష్, సన్యసిరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం స్థానిక పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పాంగి అనిల్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు వెంకట్, పార్టీ జిల్లా కార్యదర్శి గండేరు చినసత్యం, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, బొంజుబాబు, సన్నిబాబు, మండల ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, ఎంపీటీసీ మత్స్యరాస వియజకుమారి, సర్పంచ్ కిముడు రాంబాబు, నాయకులు శేఖర్, సీతారాం నాయుడు, లక్ష్మినాయుడు, పండన్న, బాలయ్యపడాల్, మురళి, ఉత్తర వేణుబాబు, సాంబాబు, బాలరాజు తదితరలు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ దేముడు, ఎంపీటీసీ సభ్యులు రాజులమ్మ, ఈశ్వరమ్మ, సత్యనారాయణ, సర్పంచ్ రాంబాబు, నాయకులు అరుణకుమార్, రామారావు, రాజేష్, చంటిబాబు, దావీద్ తదితరులు పాల్గొన్నారు

పాడేరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, వంతాల బొంజుబాబు, జీలుగుబోయిన ఈశ్వర్‌రావు, గల్లెలి లింగమూర్తి, పాంగి ఆనంద్, ఎంపీటీసీ సభ్యుడు తూపురు గంగరాజు, నాయకులు రాజేష్, లక్ష్మణ్, రామరాజు, కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.